# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈ రోజు కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారు.**

**2.** **తెలంగాణా రాష్ట్రంలో ఈ నెల 3 వ తేదీ నుండి కుటుంబ డిజిటల్ కార్డుల క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

**3.** **ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ నెల 15వ తేదీ నుండి పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో ఉంటుందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

**4.** **పరిసరాల పరిశుభ్రత కోసం కేంద్ర ప్రభుత్వం పిలుపు నిచ్చిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమం రేపటితో ముగుస్తోంది.**

**5.** **దసరా పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ..., తెలంగాణా రాష్ట్రాలు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి.**

**6.** **ఈ రోజు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

=============================

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని పుచ్చకాయలమడ గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పాల్గొని పింఛన్లు పంపిణీ చేసి .... లబ్ధిదారులతో కొద్దీ సేపు ముచ్చటిస్తారు.

--------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నైపుణ్య గణన ప్రాజెక్టును గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం నుండి ప్రభుత్వం నిన్న ప్రారంభించింది. ప్రయోగాత్మక ప్రాతిపదికన మంగళగిరి శాసన సభ నియోజకవర్గంతో పాటు తుళ్ళూరు మండలంలో నైపుణ్య గణన చేపట్టనున్నారు. రాష్ట్ర యువతలో నైపుణ్యాలను గుర్తించి అవసరమైన నైపుణ్యాన్ని అందించడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించడం నైపుణ్య గణన ప్రధాన లక్ష్యం. నైపుణ్య గణన కోసం వంద గ్రామ సచివాలయాల పరిధిలో వివరాలు సేకరిస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గం ...., తుళ్ళూరు మండలాలలో ఒక లక్షా అరవై వేలకు పైగా కుటుంబాల నుండి నైపుణ్య గణన వివరాలను తీసుకుంటున్నారు. ఇందుకు అవసరమైన మొబైల్ యాప్‌ను కూడా సిద్ధం చేశారు.

--------------------------

తెలంగాణా రాష్ట్రంలో కుటుంబ డిజిటల్ కార్డులకు సంబంధించిన క్షేత్ర స్థాయీ పరిశీలన ఈ నెల 3 నుండి 7వ తేదీ వరకు నిర్వహించాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కుటుంబ డిజిటల్ కార్డుల అంశంపై హైదరాబాదులో సంబంధిత అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు ...., 238 ప్రాంతాలలో క్షేత్ర స్థాయీ పరిశీలన చేపట్టాలని ...., కొత్త సభ్యులను చేర్చి ..., మరణించిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫోటో తీయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధారించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 15 వ తేదీ నుండి పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో ఉంటుందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..... వర్షాకాలంలో వరదల దృష్ట్యా ఇసుక తవ్వకూడదన్న ఎన్.జి.టి ఆదేశాల మేరకు ఇసుక రీచులను నిలిపి వేశామని ... బోట్ మెన్ సొసైటీలు ..., పట్టా భూములలో కూడా ఇసుక తవ్వకాలను చేపడతామని అన్నారు. దూర ప్రాంతాలకు రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయన్న సమస్యను కూడా పరిష్కరిస్తామని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణా ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిల్లీ పర్యటనలో ఉన్నారు. గత రాత్రి హైదరాబాదు నుండి డిల్లి చేరుకున్న ఆయన ఈ ఉదయం కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో సమావేశమవుతారు. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల సందర్భంగా అస్వస్థతకు గురైన ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను రేవంత్ రెడ్డి పరామర్శిస్తారు.

---------------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు గతనెల 17 నుండి ప్రారంభమైన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం రేపటితో ముగుస్తోంది. సెప్టెంబర్ 17 నుండి 15 రోజుల పాటు .... అక్టోబర్ రెండవ తేదీ వరకు .... ఈ కార్యక్రమం జరుగుతోంది. దేశ వ్యాప్తంగా వాడవాడలా ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చి దిద్దుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ..., తెలంగాణా రాష్ట్రాలలో కూడా ప్రతి నగరం ...,.పట్టణం ..., పల్లెలో ప్రభుత్వ అధికారులు ..., ఉద్యోగులు ..., ప్రజలు పారిశుధ్య పనులు ..., శ్రమదాన కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజల శ్రమదానం ద్వారా ప్రతి పంచాయితీలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

---------------------------

భారతీయ తత్వ శాస్త్ర వైభవాన్ని ప్రపంచ యవనికపై చాటి చెప్పిన ఆధునిక ఋషి పద్మ విభూషణ్ కొత్త సచ్చిదానంద మూర్తి అని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా నంబూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కొత్త సచిదానంద మూర్తి 100 వ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగే రెండు రోజుల జాతీయ సదస్సును నిన్న ఆయన ప్రారంభిస్తూ ..... సచ్చిదానంద మూర్తి స్ఫూర్తితో నేటి యువతరం భారతీయ తత్వ శాస్త్ర విజ్ఞానానికి వారదులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సచ్చిదానంద మూర్తి ప్రపంచ స్థాయికి ఎదగడానికి ఎంత గానో కృషి చేశారని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

---------------------------

దసరా పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు ఈ నెల 4 నుండి 20 వ తేదీ వరకు ఆరు వేలకు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని రాష్ట్ర రహదారి రవాణా సంస్థ ప్రకటించింది. ఈ ప్రత్యేక బస్సులలో ఎటువంటి అదనపు చార్జీలు ఉండవని..., ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం ఉంటుందని తెలిపింది. దసరా పండుగ సందర్భంగా తెలంగాణా రాష్ట్రంలో స్వస్థలాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం హైదరాబాదు నుండి వివిధ ప్రాంతాలకు ఆరు వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రాష్ట్ర రహదారి రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి.సజ్జనార్ తెలిపారు. ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా ఔటర్ రింగు రోడ్డు మీదుగా విజయవాడ ..., బెంగళూరుకు సర్వీసులను సిద్ధం చేశామని, కరీంనగర్ ..., నిజామాబాదు మార్గాలలో ఎలక్ట్రిక్ .., సూపర్ లగ్జరీ బస్సులను కూడా అందుబాటులో ఉంచుతున్నామని సజ్జనార్ తెలిపారు.

---------------------------

వృద్ధుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ రోజు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆరోగ్య ..., మానసిక పరంగా వృద్ధులను సంరక్షించవలసిన అవసరాన్ని తెలియజేస్తూ ఈ కార్యక్రమం జరుగుతోంది. 1984 సంవత్సరంలో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో వృద్ధుల సమస్యలపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. "సీనియర్ సిటిజన్" అన్న పదాన్ని ఈ సదస్సులోనే మొదటి సారి ఉపయోగించారు. ఆ తరువాత 1990వ సంవత్సరం డిసెంబర్ 14వ తేదీన ఐక్య రాజ్య సమితి వృద్ధుల కోసం ఒక నిర్దిష్ట ప్రణాళికను రూపొందించి ప్రపంచ దేశాలు దానిని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. అనంతరం .... ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు 1991వ సంవత్సరం అక్టోబర్ ఒకటవ తేదీన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుండి ప్రతి ఏటా ఈ కార్యక్రమం జరుగుతోంది.

మన దేశంలో వృద్ధుల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయి. . ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తాజాగా 70 ఏళ్లు దాటిన వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం అమలు చేయనుండడం గొప్ప విషయం.

---------------------------

హైదరాబాదులో హైడ్రా అంటే కేవలం కూల్చివేతలు మాత్రమే కాదని హైడ్రా కమిషనర్ ఏ. వి. రంగనాథ్ అన్నారు. చెరువులలో అక్రమ ఆక్రమణలను కూల్చి వేస్తున్న అంశంపై నిన్న ఆయన ఎక్స్ వేదికగా వివరణ ఇస్తూ ...మూసీ నదికి ఇరు వైపుల సర్వేలతో హైడ్రాకు సంబంధంలేదని ..., అక్కడి నివాసితులను తాము తరలించడం లేదని తెలిపారు. అక్కడ ఎటువంటి కూల్చివేతలను హైడ్రా చేపట్టడం లేదని ..., మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని చెప్పారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని ..., దీనిని మూసి రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని ఎక్స్ వేదిక ద్వారా రంగనాథ్ వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పాఠశాల విద్య .., సమగ్ర శిక్షణ విభాగం ఉన్నతాధికారులతో నిన్న ఆయన గుటూరు జిల్లా ఉండవల్లిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ..... ప్రధానోపాధ్యాయులు ..., సెకండరీ గ్రేడ్ టీచర్లకు సాల్ట్ ప్రాజెక్టు ద్వారా సమగ్ర శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ నెలాఖరు లోగా స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ .... ఎస్.ఎం.సి.లకు శిక్షణ పూర్తి చేయాలని ..., పాఠశాలలలో సౌకర్యాలు ...., ఫలితాలను మెరుగు పరచడం కోసం ఎస్.ఎం.సి.లకు

మరింత అర్థవంతమైన భాగస్వామ్యం కల్పించాలని నారా లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలలో ఈ రోజు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీకాకుళం ..., విజయనగరం..., పార్వతీపురం మన్యం ..., అల్లూరి సీతారామరాజు..., అనకాపల్లి ...., విశాఖపట్నం ...., కాకినాడ జిల్లాలలో ఒక మోస్తరు వర్షాలు ...., కోనసీమ ..., తూర్పు గోదావరి ...., పశ్చిమ గోదావరి ...., ఏలూరు ...., కృష్ణా ..., ఎన్.టి.ఆర్ ...., బాపట్ల ..., పల్నాడు ..., ప్రకాశం ...., నంద్యాల ...., అనంతపురం ..., శ్రీ సత్య సాయి ..., వై.ఎస్.ఆర్. ...., అన్నమయ్య ..., చిత్తూరు ..., తిరుపతి జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ప్రస్తుతం దేశం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ కొనసాగుతోంది. తిరోగమనంలో భాగంగా అక్టోబరు రెండో వారం వరకు తెలంగాణ రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆంధ్ర ప్రదేశ్ గనులు ..., ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలకు సూచించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నంలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ..... వ్యర్థాల సేకరణ కోసం పది మండలాలలో కీయోస్క్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేపట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొల్లు రవీంద్ర సూచించారు.

======================